## 'నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తా'



నేషనల్ హైవే అధికారులతో మాట్లాడుతున్న కోరం కనకయ్య

టేకులపల్లి, సెప్టెంబర్ 26: టేకులపల్లి మీదుగా జాతీయ రహదారి 930పి విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇచ్చారు. స్థానిక బోడు రోడ్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ ప్రాంతాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. నేషనల్ హైవే ఈఈ యుగేందర్, డీఈ శైలజ, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తదితరులు పాల్గొన్నారు.

## సదుపాయాలు కల్పించాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాలనీవాసులు

చండ్రుగొండ, సెప్టెంబర్ 26: మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీ వాసులు.. తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న డిమాండుతో గురువారం ఆందోళన నిర్వహించారు. అసంపూర్తి ఇండ్లను తమకు అప్పగించారని, విద్యుత్ లేదని, నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వ అధికారులే ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## బ్యాంక్ ఉద్యోగి బలవన్మరణం

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 26: పని భారం, ఆర్థిక ఇబ్బందులు భరించలేని బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు, ఉద్యోగి బంధువులు తెలిపిన వివరాలు.. కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన వడ్లకొండ రాజు(37) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో క్రెడిట్ కార్డ్ కలెక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన తల్లిదండ్రుల ఇంటికి దగ్గరలోనే భార్య నాగప్రసన్న, రెండేళ్ల కుమారుడితో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. తీవ్ర పని ఒత్తిడితోపాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా తన కుటుంబ సభ్యులతో ఇదే విషయం చెబుతున్నాడు. తన సహోద్యోగులు, మిత్రులతోనూ బుధవారం 'ఇదే నా చివరి రోజు.. రేపటి నుంచి ఆఫీస్‌కు రాను' అని చెప్పారు. ఆయన బుధవారం తన సొంతింటికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున అక్కడే పురుగుల మందు తాగారు. కుటుంబీకులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నాగప్రసన్న ఫిర్యాదుతో త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

## అనుబోస్ విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ, సెప్టెంబర్ 26: కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. వ్యాస రచన, పెయింటింగ్, డ్యాన్స్ పోటీల్లో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ టి.భరత్‌కృష్ణ, డైరెక్టర్ అవని, ప్రిన్సిపాల్స్ రవికుమార్, ఎన్‌వీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న తదితరులు అభినందించారు.

# బయోమైనింగ్‌తో చెత్త నియంత్రణ

### కలెక్టర్ జితేష్ వి పాటిల్




మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో బయోమైనింగ్ విధానంలో చెత్తను శుద్ధి చేసేందుకు వీలుగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో గురువారం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ విధానం ద్వారా మిషన్లతో శుద్ధి చేయనున్నట్లు చెప్పారు. వివిధ పరిమాణంలో ఉన్న వ్యర్థాలు (ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బోండాలు, రాళ్లు, వస్త్రాలు వంటివి) వివిధ దశల్లో బయటకు వస్తాయని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవోలు దామోదర్‌రావు, మధు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు, జిల్లా కాలుష్య నివారణ అధికారి రవీందర్, నాలుగు మున్సిపాలిటీ కమిషనర్లు పాల్గొన్నారు.

# వైద్యురాలు, హెచ్‌ఈవోపై చర్యలు తీసుకోవాలి

### విధులు బహిష్కరించి సమ్మె చేపట్టిన ఆశాలు



విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట సమ్మె చేస్తున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు

సారపాక, సెప్టెంబర్ 26: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీ వైద్యురాలు, హెచ్‌ఈవో, ఏఎన్‌ఎంలు ఆశాలను వేధిస్తున్నారని గురువారం ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ఆశాలతో కలిసి సమ్మె చేపట్టారు. వెంటనే అడ్మినిస్ట్రేటివ్ అధికారి ధర్నా చేస్తున్న ఆశావర్కర్లతో చర్చలు జరిపారు. దీనిపై ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వైద్యురాలు, హెచ్‌ఈవో, ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించబోమన్నారు. సోమవారం నాటికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో చర్యలు తీసుకోని పక్షంలో మంగళవారం యథావిధిగా సమ్మె చేస్తామని ఆశాలు హెచ్చరించి తాత్కాలికంగా సమ్మె విరమించారు. శిబిరంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఆశావర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎంవీ.అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బుచ్చమ్మ, తారాదేవి, కృష్ణవేణి, శ్రీలత, విజయ, నాగేశ్వరి, నాగమణి, సంపత్‌కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



సైకిళ్లు అందుకుంటున్న విద్యార్థినులు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 26: మండలంలోని హేమచంద్రాపురం ఉన్నత పాఠశాలలో పదిమంది విద్యార్థినులకు సైకిళ్లను డిస్ట్రిక్ట్ ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సమకూర్చింది. వీటిని ఫౌండేషన్ తరపున డీఈవో వెంకటేశ్వరాచారి అందజేశారు. ఫౌండేషన్ బాధ్యుడు రవి దేవిశెట్టి, ఉపాధ్యాయులు ఇంజం రామారావు, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

రామవరం, సెప్టెంబర్ 26: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రి ప్రాంతంలో హోటల్ నిర్వాహకుడు మిద్దె రాము(45) గురువారం తెల్లవారుజామున రామవరం వాటర్ ప్లాంట్ వద్ద ఆగి ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో నూజివీడు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వేగంగా వెళ్తున్న లారీ.. ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడిన రాముకు, అతని పక్కనున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న రాము మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సింగరేణి ఎడ్యుకేషన్ జీఎంగా గుండా శ్రీనివాస్

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26: సింగరేణి హెడ్డాఫీస్‌లో కంపెనీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న గుండాల శ్రీనివాసరావు గురువారం ఎడ్యుకేషన్ జీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను అధికారులు, సిబ్బంది సన్మానించారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, సెప్టెంబర్ 26: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 26: స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్ పేరెంట్స్(ఎస్.టీ.ఈ.పీ)వారి సారథ్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు అక్టోబర్ 4,5,6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్, జాకరం పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ మహమ్మద్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతి, పార్టిసిపేషన్ ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు డాక్టర్ ప్రత్యూష సుబ్బరావు సెల్ : 9030644440, ధర్మారెడ్డి సెల్: 8143234555ని సంప్రదించలన్నారు.

## పంట దిగుబడిపై అవగాహన సదస్సు



పంటపై అవగాహన కల్పిస్తున్న కంపెనీ యాజమాన్యం

ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 26: మండల పరిధిలోని మర్కోడు పంచాయతీ జిన్నెలగూడెం కొమరం రఘు పొలంలో గురువారం జినిక్ సీడ్స్ కంపెనీ యాజమాన్యం క్షేత్రస్థాయి పంట పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం పాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విత్తనంలో పంట పండించిన రైతుకు అధిక దిగుబడి రావడం ఆనందంగా ఉందని, మండలంలోని రైతులు మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలే వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అనుమోల వెంకటేశ్వరరావు, రణం నారాయణ, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు కొమరం వెంకటేశ్వర్లు, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

## కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి



అశ్వాపురం-గొందిగూడెం రహదారిలో కోనో కార్పస్ చెట్లు

అశ్వాపురం, సెప్టెంబర్ 26: అశ్వాపురం మండలంలో కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పవన్‌సాయి డిమాండ్ చేశారు. అశ్వాపురం-గొందిగూడెం వెళ్లే రహదారిలో ఇరువైపులా, అశ్వాపురం, కొమ్ముగూడెం ప్రాంతంలో కోనో కార్పస్ చెట్లను అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

## నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

**బది'లీలల'పై కొరడా?**

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

# సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం



*ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు*

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

**రైతుల ఆదాయంపై దెబ్బ?**


నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందుకెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో-ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టి లేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, ముల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

## యువతిపై ప్రేమోన్మాది దాడి



సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన రాగల సాయికుమార్(24), ఓ యువతి గతంలో ప్రేమించుకోగా.. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. చాలా రోజుల తర్వాత ఈ ఇద్దరూ గురువారం ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద కలుసుకోగా.. తనను ప్రేమించాలంటూ సాయికుమార్ యువతిపై ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. యువతి వేలికి గాయం కాగా, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




*పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు*

## రేపు యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ నిరసనలు

- జీవో 25ను సవరించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలిపి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ పిలుపునిచ్చాయి. మరోవైపు జీవో 25లోని నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే జంగయ్య, పీ నాగిరెడ్డి పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం సైతం వినతిపత్రం సమర్పించారు.

## జైనూర్ ఘటనపై విచారణ చేపట్టాలి



ఖైరతాబాద్, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఈ నెల 4న జరిగిన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషాతో కలిసి మాట్లాడారు. జైనూరులో ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

# సగం చేపపిల్లలకు సర్కారు కోత

- తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు
- టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వకనే ఈ దుస్థితి
- నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగుసార్లు టెండర్లు పిలిచినా...**

ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఆపసోపాలుపడుతున్నది. జూలై 9నుంచి నేటి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. రెండున్నర నెలల్లో నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పంపిణీదారుల నుంచి స్పందన కరువైంది. గతేడాది బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వకపోవడంతో పంపిణీదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు ఇస్తేనే టెండర్లలో పాల్గొంటామని పంపిణీదారులు చెబుతున్నారు. తొలుత పిలిచిన టెండర్‌లో ఒకే ఒక దరఖాస్తురాగా, రెండోసారికి 4దరఖాస్తులు వచ్చాయి. మూడోసారి 27వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. ఇందులో కొంతమందికి వెరిఫికేషన్‌లో చేపల చెరువులు లేకపోవడంతో వారిని తిరస్కరించారు. ఇప్పుడు 19 జిల్లాలకు దరఖాస్తులు ఓకే కాగా 12 జిల్లాలకు మళ్లీ దరఖాస్తులు పిలిచారు. వీటి ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

**బ్లాక్‌లిస్టులో పెడుతాం**

చేపల పంపిణీ రైతులపై మత్స్యశాఖలోని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పంపిణీదారు రైతులను పిలిపించిన అధికారులు.. వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి టెండర్లలో పాల్గొనాల్సిందిగా కోరినట్టు ఓ పంపిణీదారు తెలిపారు. అధికారుల హామీతో టెండర్లలో పాల్గొన్నామని, పదిహేను రోజులు గడిచినా బకాయిల ఊసెత్తడంలేదని తెలిపారు. దీనిపై అధికారులను ఆరా తీస్తే.. బకాయిలు ఇచ్చే పరిస్థితిలేదని, టెండర్‌లో ఎంపికైన వాళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని ఆదేశించినట్టుగా తెలిసింది. రైతులు అగ్రిమెంట్‌కు నిరాకరించగా 'మీ బకాయిలు ఎలా వస్తాయో చూస్తాం. మీ డిపాజిట్ డబ్బులను బ్లాక్ చేస్తాం. మళ్లీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్టులో పెడతాం' అంటూ బెదిరించినట్టుగా ఓ పంపిణీదారు ఆవేదనను వ్యక్తం చేశారు.

### పంపిణీ ఇంకెప్పుడు ?

ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభంకావాల్సిన చేపల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ పూర్తవుతున్నా టెండర్ దశలోనే ఉంది. పంపిణీ ఆలస్యమవుతుండడంతో ఏప్రిల్ వరకు చెరవులు, కుంటల్లో నీళ్లు తగ్గి చేపలు ఆశించిన స్థాయిలో పెరుగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగైదేండ్లుగా పుష్కలమైన చేపలను విక్రయించి ఆర్థికంగా భరోసా దక్కిందని, ఇప్పుడు పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 50శాతం పంపిణీ నిర్ణయాన్ని విరమించుకొని 100శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.